# నిక్కచ్చిగా అంచనా వేద్దాం – దుడ్డు ప్రభాకర్

(30 అక్టోబర్ 2009, ఆంధ్రజ్యోతి)

దళిత, ఆదివాసీ, మహిళా హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం అనేక పోరాటాలు జరుగుతున్నాయి. అవి ఏవీ జరగనట్టు హక్కుల ఉద్యమానికి ఆది–అంతం బాలగోపాలే అని వ్యాఖ్యానించడం ఆయన మనస్తత్వానికి పూర్తి వ్యతిరేకం. ఈ వింత పోకడ ఇప్పటి వరకూ పార్లమెంటరీ పార్టీల నాయకులు మరణించిన సందర్భాలలో కనిపిస్తూ ఉండేది. ఇంత వరకు ఏ ఉద్యమకారుడు మరణించిన సందర్భంలో కూడా ఇలాంటి వ్యాఖ్యానాలు వినలేదు.

బాలగోపాల్ హఠాన్మరణంతో దేశ వ్యాప్తంగా ఆయన అభిమానులు, విప్లవాభిమానులు, అనేక ప్రజాసంఘాల నాయకులు ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, మానవ హక్కుల వేదిక నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన అంతిమ యాత్రలో వేలాది మంది ప్రజలు కాలినడకన పాల్గొని తమ ప్రియతమ నాయకునికి తుది వీడ్కోలు పలికారు. అమెరికన్ సామ్రాజ్యవాదం గురించి, విష సంస్కృతి గురించి ఊకదంపుడు ఉపన్యాసాలతో జనాన్ని ఉర్రూతలూగిస్తూ అమెరికా వ్యామోహంలో మునిగితేలే మేధావులు, రచయితలు, కళాకారులు, ఉద్యమనాయకులు మనకు తారసపడుతున్నారు. మేకప్ చెదరకుండా నిత్యం టీవీలలో దర్శనమిచ్చే ఉద్య మ రథసారధులూ మనకళ్ళెదుటే ఉన్నారు.

వీళ్ళందరితో పోల్చుకుంటే బాలగోపాల్ మహనీయుడే. అయితే వీళ్ల వైఖరినెప్పుడూ బాలగోపాల్ వ్యతిరేకించలేదు. వాళ్ళనేకాదు, ఎవరిని కష్టపెట్టే మనస్తత్వం కాదాయనది. అందుకే వారందరూ ఆయనలోని మంచి లక్షణాలను ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని ఎత్తిపట్టారు. ఇంకా ఒకడుగు ముందుకేసి బాలగోపాల్ హక్కుల ఉద్యమ ఆఖరి మనిషని, ఆయన లేని కారణంగా ఏర్పడబోయే శూన్యాన్ని తలచుకుంటేనే భయమేస్తుందని, పేదల హక్కులకు దిక్కేదని, హక్కుల గుండె ఆగిపోయిందని, అసలు అలాంటి మనిషి రక్తమాంసాలతో తిరగాడటంటే నమ్మలేకున్నామని అనేక విధాలుగా కొనియాడుతున్నారు. అతి కొద్ది మంది మధ్యతరగతి వ్యక్తుల అభిప్రాయాలే ప్రజాభిప్రాయాలుగా చెలామణి అవుతున్న ఎస్ఎమ్ఎస్‌ల మీడియా మాయాజాలంలో ఇలాంటి వాదనలు విస్తృత ప్రచారం పొందడంలో వింతలేదు.

కానీ ఆరుగురు నాయకుల్ని బలిదానమిచ్చిన పౌరహక్కుల సంఘం అనే సంస్థ అనేక భౌతిక దాడులను, బెదిరింపులను, అధిగమించి ముందుకు వెళుతున్న విషయం వీళ్లకు స్ఫురణకు రాకపోవడమే విచిత్రం. తరతరాలుగా అగ్రకుల భూస్వామ్య పాలక వర్గాలకు వ్యతిరేకంగా గ్రామస్థాయిలో దళిత, ఆదివాసీ, మహిళా

హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం అనేక పోరాటాలు జరుగుతున్నాయి. అవి ఏవీ జరగనట్టు హక్కుల ఉద్యమానికి ఆది–అంతం బాలగోపాలే అని వ్యాఖ్యానించడం బాలగోపాల్ మనస్తత్వానికి పూర్తి వ్యతిరేకం. ఈ వింత పోకడ ఇప్పటి వరకూ పార్లమెంటరీ పార్టీల నాయకులు మరణించిన సందర్భాలలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు పొగడ్తలలో కనిపిస్తూ ఉండేది.

ఇంత వరకు ఏ ఉద్యమకారుడు మరణించిన సందర్భంలో కూడా ఇలాంటి వ్యాఖ్యానాలు వినలేదు. (శ్రీశ్రీ విషయంలో మాత్రం ఇలాంటి విపరీత ధోరణులు మళ్ళీ మళ్ళీ కొనసాగుతూనే ఉన్నాయి) సమాజ పరిణామక్రమాన్ని, గతితార్కిక వాదాన్ని నిరాకరించే, ప్రగతిశీల ప్రజాస్వామిక ఉద్యమాలను కించపరిచే, ప్రజలను గందరగోళానికి గురిచేసే ఇలాంటి వ్యాఖ్యానాలకు ముగింపు చెప్పడమే బాలగోపాల్‌కు అందించే నిజమైన నివాళిగా నేను భావిస్తున్నాను. బాలగోపాల్ ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో పనిచేస్తున్నప్పుడు గానీ, మానవహక్కుల వేదికలో పనిచేస్తున్నప్పుడు గానీ ఆయన చాలా స్పష్టంగా, నిజాయితీగా ఆయన అభిప్రాయాలను నిర్భయంగా ప్రకటించారు.

అనేక కారణాల రీత్యా ఆయన్ని అభిమానించే వారు, ఆరాధించే వారు మాత్రం ద్వంద్వ వైఖరితో ఉన్నారు. బాలగోపాల్ మానవతావాది. స్వతహాగా హింసకు వ్యతిరేకి. అందుకు ఆయన సామాజిక నేపథ్యం కారణం కావచ్చు. ఆ విషయం ఆయన సోదరి స్పష్టం చేశారు. ఆయన కార్యాచరణ కూడా దాన్ని రుజువు చేసింది. బాలగోపాల్ కాకతీయ యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా పనిచేస్తున్నప్పుడు రాజ్యం చేస్తున్న విచ్చలవిడి హింసకు చలించి పౌరహక్కుల సంఘంలో పనిచేయడానికి సిద్ధపడ్డారంటే రాజ్యహింస ఆయనపై ఎంతటి ప్రభావం చూపిందో అర్థం చేసుకోవచ్చు. నక్సలైట్ల అణచివేత పేరుతో అణగారిన ప్రజలపై రాజ్యం అమలు చేస్తున్న హింసకు వ్యతిరేకంగా పౌరహక్కుల ఉద్యమాన్ని నడిపారు.

రాజ్యహింసకు ప్రతిగా నక్సలైట్ల నాయకత్వంలో పీడితులు చేస్తున్న ప్రతిహింసను కూడా బాలగోపాల్ సహించలేదు. 'పోరాటాల పేరుతో నక్సలైట్లు చేస్తున్న హింసను కూడా పౌరహక్కుల సంఘం ఖండించాలని' సంఘంలో చర్చను లేవనెత్తారు. 1991 నుంచి 98 వరకు సంస్థలోనూ, బయటా సుదీర్ఘమైన చర్చ జరిగింది. ఆ చర్చను హింస, ప్రతిహింస మధ్య తేడాను చెరిపే విధంగా పాలకులు మలుచుకున్నారు. ఆ సమయంలోనే ప్రతిహింస ప్రైవేట్ హింసగా పిలవబడి నేడు విప్లవ హింసగా సిర్థపడింది. బాలగోపాల్ రాజ్యహింసను, నక్సల్స్ హింసనూ వ్యతిరేకించడంలో ఉన్నది వ్యక్తిగత ధైర్యం మాత్రమే కాదు, తాను నమ్మిన మానవతా మధ్యేవాదంపై ఆయనకున్న అచంచల విశ్వాసం.

అందుకే ఆయన అటు విప్లవకారులకు, ఇటు రాజ్యానికి, శాంతిని కోరుకునే సాధారణ ప్రజానీకానికి అభిమాన పాత్రుడయ్యారు. పౌరహక్కుల సంఘంలో బాధ్యుడిగా ఉన్నప్పుడు హిందూత్వ శక్తులు దాడి చేశాయి. 'ప్రజాబంధు' పేరుతో పోలీసులు కిడ్నాప్ చేసి మూడురోజులు చిత్రహింసలు పెట్టారు. ప్రజల ఒత్తిడి మేరకు వదిలేశారు. ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో పోలీసులు హత్యాప్రయత్నం చేశారు. మరణించాడనుకొని వదిలివెళ్లారు. అనేక జిల్లాల్లో కేసులు పెట్టారు. 'టాడా' చట్టం కింద కేసు పెట్టి జైలులో నిర్బంధించారు. కానీ మానవహక్కుల వేదిక బాధ్యతలు తీసుకున్న తర్వాత ఒక్క కేసు కూడా రిజిష్టర్ కాలేదు. ఆయనపై హత్యాయత్నానికి పాల్పడిన పోలీసులు, హిందూత్వ శక్తులకు ఆయన ప్రజల కోసం ప్రాణాలర్పించిన మహనీయుడయ్యారు.

విప్లవ అభిమానులకు, విప్లవ కారులకు, వారి సానుభూతిపరులను అనేక రూపాలలో అత్యంత క్రూరంగా హత్యలు చేయిస్తున్న పాలక వర్గాలకు; దళితులకు, దళితులపై దాడులకు పాల్పడుతున్న అగ్రకుల భూస్వామ్య శక్తులకు; సామాన్య మానవులకు, మధ్య తరగతి మేధావులకు అందరికీ మరపురాని మహామనిషిగా గుర్తుండి పోవడానికి ఆయన సాధారణ జీవితం, అసాధారణ వ్యక్తిత్వం, మానవతా మధ్యేవాదమే కారణం. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ మిశ్రమ స్పందనకు కారణాన్ని పరిశీలించాల్సి ఉంది. భవిష్యత్‌లో మేధావుల పాత్ర ఇలానే ఉండబోతుందా! అందులో భాగంగానే బాలగోపాల్‌ను ఒక మోడల్‌గా నిలబెట్టే ప్రయత్నం జరుగుతున్నట్లనిపిస్తుంది. ఒక దశలో బాలగోపాల్ మార్క్సిజంలో ఖాళీలున్నాయని, అది పూర్తిచేసే ప్రయత్నం చేస్తానని ప్రకటించారు.

ఆతర్వాత సమాధానాలు దొరికాయి అన్నారు. కానీ ఎందుకనో ప్రజల ముందుంచలేదు. బాలగోపాల్ హక్కుల ఉద్యమ ప్రస్థానం హింసను సహించలేని మానవతా మధ్యేవాదంతో అహింసా పద్ధతిలోనే కొనసాగింది. కానీ బాలగోపాల్‌ను మార్క్సిస్టు మేధావులు, మార్క్సిస్టేతర మేధావులు మూకుమ్మడిగా బాలగోపాల్ మార్క్సిస్ట్ మేధావి అని కీర్తిస్తున్నారు. ఇది బాలగోపాల్ వ్యక్తిత్వాన్ని వక్రీకరించడం, ప్రజల్ని ఆయోమయానికి గురిచేయడమే అవుతుంది. ఈ అసమాన సమాజంలో ఎవరి హక్కులు హరించి వేయబడుతున్నాయి? ఎందుకు హరించవేయబడుతున్నాయి? వాటి సాధన కోసం ఏమి చేయాలి? అనుకున్నప్పుడు అందరు చెప్పే సమాధానం పోరాటమే.

ప్రజాస్వామ్య పరిధిలో జరిగే ఆ పోరాటాన్ని రాజ్యం రక్తసిక్తం చేస్తే! అనివార్యంగా ప్రజలు ప్రతిఘటించాల్సివస్తే, అది ప్రతిహింసకు దారితీస్తే! అప్పుడు ఆ రెండు హింసలూ ఖండించదగ్గవే అనడం మార్క్సిజం అవుతుందా? హింసకు తావులేకుండా అందరికీ సమాన హక్కులు దక్కడం అసాధ్యం. ఆ విధంగా ఆశించడం అశాస్త్రీయమౌతుంది. అంతిమంగా అది హక్కులు హరించి వేయబడుతున్న వర్గానికి అనర్థదాయకం.

బాలగోపాల్ మరణం సందర్భంగా జరుగుతున్న చర్చను పరిశీలించినట్లైయితే మేధావుల వైఖరి ఆందోళన కలిగించేలా ఉంది. గతంలో డాక్టర్లు, లాయర్లు, ప్రొఫెసర్లు, కవులు,కళాకారులు,రచయితలు ప్రజాపోరాటాలకు అండగా నిలబడే వారు ఆ క్రమంలో ప్రాణాలు కూడా వదిలేశారు.

నేడు సామ్రాజ్యవాదులు అనేక రూపాలలో పేద ప్రజల జీవితాలను ధ్వంసం చేస్తున్నారు. ప్రజాస్వామికంగా నిరసన తెలియజేస్తున్న బాధిత ప్రజలపై పాలకులు తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. పారిశ్రామిక అభివృద్ధి పేరుతో తుపాకీ పహారా మధ్య మానవ విధ్వంసం జరుగుతుంది. అందుకు రాష్ట్రంలో జరుగుతున్న భూ నిర్వాసితుల పోరాటాలే నిదర్శనం. బాధితులకు అండగా ఉండాల్సిన మేధావి వర్గం తప్పొప్పులను నిర్ణయించే న్యాయ నిర్ణేతలుగా ఉండే వైఖరిని ప్రకటిస్తున్నది. అనేక ప్రజాపోరాటాలకు, అస్తిత్వ ఉద్యమాలకు పుట్టినిల్లయిన ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి పరిస్థితులు దాపురించడం అత్యంత విషాదకరం. సమస్యల పరిష్కారం కోసం పోరాడే సమూహాల నుంచి మేధావుల్ని దూరం చేసింది.

ఆ కారణంగా పోరాడే ప్రజలు పాలక వర్గాలను ఆశ్రయిస్తున్నారు. దాని ఫలితంగా బషీర్‌బాగ్, ముదిగొండలో ప్రజలు కార్చిన నెత్తురు పాలకుల పీఠాలకు రంగుగా మార్చబడింది. మూడున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష అయిన ప్రత్యేక తెలంగాణ సాధన పాలకుల ప్రయోజనాలను నెరవేర్చే ఆయుధంగా మారింది. వాకపల్లి ఆదివాసీ మహిళల ఆక్రందన అరణ్యరోదనగా మిగలడానికి కారణాలను వెతకాల్సివుంది. దళిత ఉద్యమం దాని అస్తిత్వం కోల్పోవడానికి కారణమైన దళిత మేధావి వర్గం పాత్రను సమీక్షించుకోవాల్సి ఉంది.

బలవంతమైన సర్పంలాంటి సామ్రాజ్యవాదం నుంచి తమను తాము రక్షించుకొనే క్రమంలో చలిచీమల్లాంటి ప్రజలు సామ్రాజ్యవాదుల్ని తరిమేసే క్రమంలో జరిగే హింస, ప్రతిహింసల మధ్య ప్రజలకు సహాయపడకపోయినా రెండు హింసలను ఒకటిగా విశ్లేషించకుండా మౌనంగానైనా ఉండాల్సిన చారిత్రక అవసరం, బాధ్యత సమాజాన్ని ప్రభావితం చేసే మేధావి వర్గంపై ఉందని గుర్తుచేస్తున్నాను.

*(వ్యాసకర్త కులనిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు)*